క్లుప్తంగా

విద్యార్థినులకు వాలీబాల్ పోటీలు


క్రీడాకారులతో వసతి గృహ సంక్షేమ అధికారులు

అమలాపురం రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలను పురస్కరించకొని ఈ నెల 10వ తేదీ నుంచి 25వ తేదీ వరకూ జరుగుతున్న క్రీడా పోటీల్లో భాగంగా పట్టణంలోని వడ్డెగూడెంలో సోషల్ వెల్ఫేర్ కాలేజీ హాస్టల్ విద్యార్థినులకు మంగళవారం వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కోనసీమ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీల్లో వివిధ కళాశాలల విద్యార్థినులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

ఐ.పోలవరం: జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా పశువులలో గాలి కుంటు వ్యాధి నివారణకు పశువులకు టీకాలు చేశారు. రైతులు పశువులపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మండల పశువైద్యాధికారి గణేష్ బాబు అన్నారు. మంగళవారం మురమళ్ల భద్రకాళి సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో ఉన్న గోశాలలోని పశువులకు టీకాలు వేశారు. మండలంలోని 14 గ్రామాల్లో పశువులకు ఈనెల 30 వరకూ టీకాలు వేస్తున్నామన్నారు. ఇప్పటి వరకూ 86 వేల పశువులకు ఈటీకాలు వేసినట్టు తెలిపారు. పశువులకు వ్యాధి లక్షణాలు తీవ్రమైన జ్వరం, నీరసం, నోటి నుంచి చొంగ కారడం ఉంటాయన్నారు.

రేపు వైద్యశిబిరం

యానాం: అయ్యన్ననగర్ మత్స్యకార గ్రామంలో గురువారం ప్రభుత్వ ఆయుర్వేదం, హోమియో వైద్యులు వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు మంగళవారం మత్స్యశాఖ ఏడీ దడాల గొంతియ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యశిబిరంలో విష జ్వరాలు, కీళ్ల నొప్పులతో బాధపడేవారికి వైద్యం అందించడంతోపాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని తెలిపారు.

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ విజయసారథి

అల్లవరం: ప్రతి విద్యార్థి విద్యతో పాటుగా క్రీడల్లో రాణించాలని ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ విజయసారథి అన్నారు. ఓడలరేవులోని బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఇంట్రా మురల్ స్పోర్ట్స్ మీట్-2023 క్రీడలను డీఎస్పీ విజయసారథి ప్రారంభించారు. కన్వీనర్ ఎ.ప్రవీణ్ ఆధ్వర్యంలో జరిగిన క్రీడల్లో ముఖ్య అతిథి విజయసారథి మాట్లాడుతూ విద్యార్థులు క్రీడా నైపుణ్యాన్ని సాధించాలన్నారు. అనంతరం క్రీడలను లాంఛనంగా ప్రారంభించారు. బీవీసీ విద్యా సంస్థల అధినేత బోనం కనకయ్య, వైస్ చైర్మన్ కృష్ణ సతీష్, ప్రిన్సిపాల్ చంద్రమౌళి, డీన్ జనార్దనరావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అక్రమంగా ఉన్న మట్టి సీజ్


స్వాధీనం చేసుకున్న మట్టి గుట్టలు

ఉప్పలగుప్తం: సరిపల్లి గ్రామంలో అక్రమంగా నిల్వ చేసి దూర ప్రాంతాలకు తరలిస్తున్న మట్టి గుట్టలను గుర్తించి సీజ్ చేసినట్టు తహసీల్దార్ జె.వెంకటేశ్వరి మంగళవారం తెలిపారు. మండలంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా మట్టి తవ్వకాలు జరిపి, రవాణా చేయడంతో మంగళవారం యథేచ్ఛగా మట్టి రవాణా అనే శీర్షికతో 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన అధికార యంత్రాంగం అనధికారికంగా ట్రాక్టర్లతో మట్టి గుట్టలను తరలిస్తున్న లోపల ప్రాంతాన్ని గుర్తించి ఎర్ర జెండాలను పాతారు. ఆ గుట్టలను తరలించకుండా సిబ్బందిని అందుబాటులో కాపలా ఉంచామని ఎమ్మార్వో తెలిపారు. మండలంలో ఎవరైనా అనుమతులు లేకుండా మట్టి, ఇసుక తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వచ్చే నెలలో ఎల్‌డీసీ, యూడీసీ పరీక్ష

యానాం: పుదుచ్చేరిలో వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఎల్‌డీసీ, యూడీసీ పోస్టుల భర్తీకి రాత పరీక్ష ఏప్రిల్‌లో నిర్వహిస్తామని సీఎం రంగసామి పేర్కొన్నారు. మంగళవారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు జవాబు ఇచ్చారు. ప్రస్తుతం ఇంటర్, ప్లస్ టు పరీక్షలు పూర్తయితే వచ్చే నెలలో రాత పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

కమ్యూనిటీ హాలు నిర్మించాలి

అమలాపురం రూరల్: క్రైస్తవులకు కమ్యూనిటీ హాలు నిర్మించాలని మండల యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం కోరింది. కొంకాపల్లి పెంతుకోస్తు ప్రార్థన మందిరంలో మండలం పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు మొసలి స్పర్జన్ రాజు అధ్యక్షతన మంగళవారం సమావేశం జరిగింది. కమ్యూనిటీ హాలు నిర్మాణం కోసం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ దృష్టికి తీసుకువెళ్లగా స్థల సేకరణ చేసి భవన నిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారని సభ్యులు తెలిపారు.

మహిళలకు చేయూత

- కోరంగిలో చేయూత మహిళా మార్ట్
- ప్రారంభానికి సర్వం సిద్ధం
- తక్కువ ధరలకే వస్తువుల విక్రయాలు


కోరంగిలో త్వరలో ప్రారంభం కానున్న చేయూత మహిళా మార్ట్

తాళ్లరేవు: గ్రామీణ ప్రాంత మహిళల ఆర్థిక పరిపుష్టి ధ్యేయంగా ప్రభుత్వం చేయూత మహిళా మార్ట్‌లను ఏర్పాటు చేస్తోంది. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు దాచుకున్న పొదుపు డబ్బులతోపాటు ప్రభుత్వం అందించే సహకారంతో మార్ట్‌లను ఏర్పాటు చేస్తున్నారు. కార్పొరేట్ మార్ట్‌లకు ఏమాత్రం తీసిపోని విధంగా సకల ఏర్పాట్లు చేస్తున్నారు. తాళ్లరేవు మండలం కోరంగి పంచాయతీ పరిధిలో జాతీయ రహదారి 216కు ఆనుకుని ఉన్న బాలయోగి కల్యాణ మండపం ప్రాంగణంలో ఈ మార్ట్‌ను నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేస్తున్నారు.

ఈ మార్ట్‌లలో పూర్తిగా మహిళలే వ్యాపార లావాదేవీలు సాగించడం గమనార్హం. ప్రజలకు అవసరమైన అన్ని రకాల నిత్యవసర వస్తువులతోపాటు, స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన వివిధ రకాల ప్రత్యేకతలు కలిగిన వస్తువులను సైతం ఈ మార్ట్‌లో అందుబాటులో ఉంచనున్నారు. ముఖ్యంగా మహిళలు తయారు చేసే హస్తకళలైన వివిధ రకాల అలంకరణ వస్తువులు, జ్యూట్ బ్యాగులు, మ్యాట్‌లు, వస్త్రాలు, కొబ్బరి పీచు ఉత్పత్తులు, వెజ్, నాన్‌వెజ్ పచ్చళ్లు, మత్స్య ఉత్పత్తులు తదితర సాంప్రదాయ వస్తువులను మార్ట్‌లో అందుబాటులో ఉంచనున్నారు. వ్యాపార రంగంలో వస్తున్న నూతన ఒరవడిలను గ్రామీణ ప్రాంత ప్రజలకు సైతం అందుబాటులోకి తేవాలన్న ప్రభుత్వ లక్ష్యానికి ఈ మార్ట్‌లే నిదర్శనంగా నిలుస్తాయనడంలో ఎటువంటి సందేహం లేదు.


సుందరంగా రూపుదిద్దుకుంటున్న మార్ట్ లోపలి భాగం

ప్రభుత్వ సాయం



మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఈ మార్ట్‌లను ఏర్పాటు చేస్తోంది. మండలంలోని ప్రతీ గ్రూపు సభ్యులు ఒక్కొక్కరూ రూ.200 వాటా ధనం చెల్లించి ఈ మార్ట్‌లో భాగస్వాములవుతున్నారు. మండలంలో 22 వేల మంది గ్రూపు సభ్యులతో రూ.44 లక్షల వ్యయంతో దీనిని ఏర్పాటు చేస్తున్నాం. గ్రూపు సభ్యులతోపాటు సామాన్య ప్రజలు కూడా వస్తువులను కొనుగోలు చేసే ఉద్దేశంతో ఈ మార్ట్‌ను ఏర్పాటు చేస్తున్నాం. ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మార్ట్ తెరిచి ఉంటాయి.

– రెడ్డి సన్యాసిరావు, ఏపీఎం, వైఎస్సార్ క్రాంతి పథం, తాళ్లరేవు.

ఎంతో ఆనందం



ఈ మార్ట్ ఏర్పాటు చేయడం మాకు చాలా ఆనందంగా ఉంది. దీని ద్వారా నిత్యావసర వస్తువులన్నీ తక్కువ ధరల్లోనే లభిస్తాయి. స్థానిక మార్కెట్‌లలో ఎక్కువ ధరలకు వారు ఇచ్చిన వస్తువులనే తీసుకోవాల్సి వచ్చేది. లేదంటే వస్తువుల కొనుగోలుకు కాకినాడ వెళ్లాల్సి వచ్చేది. అయితే ఇక నుంచి మా ప్రాంతంలోనే మాకు నచ్చిన వస్తువులను మేమే ఎంపిక చేసుకుని తక్కువ ధరలలో కొనుగోలు చేసుకోవచ్చు.

–ఉబ్బన సునీత, గ్రూపు సభ్యురాలు, పటవల

అందుబాటులో ధరలు



చేయూత మహిళా మార్ట్‌లో వస్తువులన్నీ సామాన్యులకు అందుబాటు ధరలోనే ఉంటాయి. నిత్యావసరాలకు ఉపయోగపడే అన్ని వస్తువులు ఇక్కడ లభిస్తాయి. డ్వాక్రా సంఘాల సభ్యులు తయారు చేసే వివిధ రకాలైన వస్తువులు కూడా మార్ట్‌లో అందుబాటులో ఉంచుతాం. ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయ్యాయి. ఈ నెలలోనే ఈ మార్ట్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

–తాతపూడి మహేష్, చేయూత మహిళా మార్ట్ స్టోర్ మేనేజర్

లాభాల బాట



జిల్లాలో ఉప్పాడ, ఎ.కొత్తపల్లి గ్రామాల్లో చేయూత మార్ట్‌లు ప్రారంభించాం. అవి లాభాల బాటలో నడుస్తున్నాయి. వైఎస్సార్ చేయూత పథకం ద్వారా రుణాలు తీసుకుని ఏర్పాటు చేసిన ప్రాజెక్టుల ద్వారా తయారు చేసే వస్తువులను ఈ మార్ట్‌లో విక్రయించి, ఆర్థిక చేయూత నివ్వాలనే లక్ష్యంతో ఈ మార్ట్‌లను ఏర్పాటు చేస్తున్నం. ఈ మార్ట్ నిర్వహణకు ముగ్గురు పాలక వర్గ సభ్యులతోపాటు 17 మంది డైరెక్టర్‌లు ఉండి తమ సేవలందిస్తారు.

– వీటీ రాయ్ డీపీఎం, మహిళా చేయూత మార్ట్

మహిళలే పర్యవేక్షకులు



కోరంగిలో ఏర్పాటు చేయబోయే మహిళా మార్ట్‌లో వస్తువుల విక్రయాల దగ్గర నుంచి సరుకుల సరఫరా వరకు అన్నీ మహిళలే చేస్తారు. వ్యాపార రంగంలో సైతం మహిళల సత్తా చాటుకునేందుకు ఇదొక సరికొత్త ప్రయత్నం. మహిళా సంఘాల అభివృద్ధి కోసం ఇటువంటి పథకాలను తీసుకువస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు

– దండుప్రోలు నూకరత్నం, మహిళా మార్ట్ ప్రెసిడెంట్, పెదబొడ్డు వెంకటాయపాలెం

పాఠశాలలో ఆర్జేడీ ఆకస్మిక తనిఖీ


విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్జేడీ నాగమణి

ఐ.పోలవరం: జి.వేమవరం జెడ్పీ పాఠశాలను రీజనల్ జాయింట్ డైరెక్టర్(ఆర్జేడీ) జి.నాగమణి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు, పిల్లలకు మెనూ ప్రకారం భోజనం అందుతుందా లేదా అనేది పిల్లలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా తరగతి గదుల్లో పిల్లల పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ పరిశీలించారు. ఇందులో పిల్లల వర్క్ బుక్స్ కరెక్షన్ చేయాలని, సిలబస్ సకాలంలో పూర్తి చేయాలన్నారు. పిల్లల ట్యాబ్‌ల వినియోగం పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పాఠశాలలో ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించి పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత ఉండేలా పిల్లలను తయారు చేసేందుకు డే టెస్టులు నిర్వహించాలన్నారు. ఆమె వెంట హెచ్ఎం సలాది వెంకట నారాయణ ఉన్నారు.

వెంకన్న హుండీల ఆదాయం రూ.11 లక్షలు

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీలను మంగళవారం తెరచి లెక్కించారు. గత 64 రోజులకు గాను హుండీల ద్వారా ఆలయానికి రూ.11,00,076 ఆదాయంగా వచ్చింది. హుండీల లెక్కింపు కార్యక్రమంలో ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి, భీమనపల్లి గ్రూపు దేవాలయాల ఈవో కోనేటి కార్తీక, ఆలయ ఈవో దూనబోయిన సాయిబాబు, వైఎస్సార్ సీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు దూడల ఫణి, ఆలయ ధర్మకర్తలు నడింపల్లి వర్మ, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. ఇటీవల కాలంలో స్వామి దర్శనానికి భక్తులు పెరగడం వల్లే హుండీల ద్వారా ఆదాయం పెరిగిందని చైర్‌పర్సన్ విరీతాదేవి పేర్కొన్నారు.

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

కాట్రేనికోన: మండలంలోని ప్రభుత్వ, ప్రవేటు విద్యాసంస్థలలో పల్లంకుర్రు, కాట్రేనికోన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(పీహెచ్‌సీ) వైద్యులు పర్యవేక్షణలో నులిపురుగులు దినోత్సవం సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రలను విద్యార్థులతో మింగించారు. మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఎంపీపీ, యుపీపీ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలు, అంగన్ వాడీ కేంద్రాలు, చెయ్యేరు శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలలో నులిపురుగులు నియంత్రణ దినోత్సవంపై అవగాహన, ర్యాలీలు నిర్వహించారు. చెయ్యేరు శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాలలో 353 మంది విద్యార్థులకు మాత్రలు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డీవీఎస్ఎన్ వర్మ, ప్రిన్సిపాల్ రత్నంరాజు, పాలకవర్గం సభ్యులు సందీప్, రమేష్ రాజు తదితరులు ఉన్నారు.

నులి పురుగు నివారణ మాత్రల పంపిణీ

అల్లవరం: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా గోడిలంక పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో పిల్లలకు నులి పురుగు నివారణ మాత్రలు పంపిణీ చేశామని డాక్టర్ సుమ తెలిపారు. రక్తహీనత లోపాన్ని నివారించేందుకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేస్తున్నామన్నారు. పీహెచ్‌సీ పరిధిలో 6271 మందికి మాత్రలను పంపిణీ చేసినట్టు తెలిపారు. బోడసకుర్రు ఉన్నత పాఠశాలలో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి సమక్షంలో నులి పురుగుల నివారణ మాత్రలను విద్యార్థులకు అందించారు.

ఉప్పలగుప్తం: మండలంలోని జెడ్పీ, ఎంపీపీ, ప్రైవేటు పాఠశాలల్లో అంగన్‌వాడీ కేంద్రాలలో ఉన్న పిల్లలకు నులి పురుగు నివారణ మాత్రలను పంపిణీ చేసినట్టు ఎంపీడీవో కేఎస్ గౌరీకుమారి తెలిపారు. గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎంపీడీవో పాల్గొని విద్యార్థులకు మాత్రలను వేశారు.


విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేస్తున్న దృశ్యం


గొల్లవిల్లి హైస్కూల్లో విద్యార్థులకు మాత్రలను అందిస్తున్న ఎంపీడీఓ గౌరీకుమారి

అమలాపురం రూరల్: కామనగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నులి పురుగు నివారణా దినోత్సవం నిర్వహించారు. సర్పంచ్ నక్కా అరుణ కుమారి చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ పందిరి హరి రాంగోపాల్, ఎంపీడీఓ ప్రసాద్, ఉప సర్పంచ్ రాజులపూడి భాస్కర్ రావు విద్యార్థులకు మాత్రలు వేశారు. పేరూరు పీహెచ్‌సీ వైద్యురాలు ఎం.శాంతికుమారి, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరరావు స్కూలు ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానదాయకంగా సైన్స్‌ఫెయిర్

అమలాపురం టౌన్: స్థానిక విద్యానిధి స్కూలులో మంగళవారం ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్-2023 ప్రదర్శన విజ్ఞానదాయకంగా సాగింది. ఆర్డీవో వసంత రాయుడు సైన్స్ ప్రదర్శనకు ముఖ్య అతిథిగా హాజరై ఆద్యంతం తిలకించారు. ఇలాంటి సైన్స్ ప్రదర్శన నిర్వహణ వల్ల విద్యార్థుల్లో శాస్త్రీయమైన ఆలోచనలు అభివృద్ధి చెంది భవిష్యత్ శాస్త్రవేత్తలు అవుతారని ఆర్డీవో వసంతరాయుడు పేర్కొన్నారు. సైన్స్ ప్రదర్శనలు తిలకించిన ఆర్డీవో పలువురి విద్యార్థులను పలు అంశాలపై ప్రశ్నించి సమాధానాలు రాబట్టారు. ఆర్డీవోతోపాటు తహసీల్దార్ పరమట శ్రీపల్లవి, విద్యానిధి విద్యా సంస్థల చైర్మన్ ఏబీ నాయుడు, ప్రిన్సిపాల్ టీఎస్ మాధవి, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థులు దాదాపు 100కి పైగా సైన్స్ ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. వాటిని అవగాహన చేకునేందుకు విద్యార్థులు ఆసక్తి చూపారు.


విద్యానిధి స్కూలులో సైన్స్ ప్రదర్శనలను తిలకిస్తున్న ఆర్డీవో వసంతరాయుడు

సంఘాలుగా ఏర్పడితే ఆర్థిక సాయం అందిస్తాం

కాట్రేనికోన: చేపలు ఉత్పత్తిదారులు సంఘాలుగా ఏర్పడితే వారికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందిస్తుందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా డీఆర్‌డీఏ పీడీ వి.శివశంకర ప్రసాద్ అన్నారు. కాట్రేనికోన మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం వెంకటేశ్వరరావు అధ్యక్షతన చేపల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డీఆర్‌డీఏ పీడీ వి.శివశంకర ప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫిష్ ఆంధ్రా యూనిట్స్ పెట్టుకునేందుకు సంఘాల సభ్యులు ముందుకు వస్తే రుణాలు మంజూరు చేసి యూనిట్ల నిర్వాహణకు సహాయం అందిస్తామన్నారు. ఎండు చేపలు, రొయ్యలు తయారు చేసేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏపీడీ జిలానీ, మండల సమాఖ్య అధ్యక్షురాలు బడుగు రోజా, ఎఫ్‌డీఓ రామకృష్ణ తదితరులు ఉన్నారు.


సంఘం సభ్యులతో డీఆర్‌డీఏ పీడీ శివశంకరప్రసాద్

నూతన సంవత్సర పంచాంగం ఆవిష్కరణ


శోభకృత్ సంవత్సర పంచాగాన్ని ఆవిష్కరిస్తున్న వైఖానస సంఘ ప్రతినిధులు

తాళ్లరేవు: శోభకృత్ నామ సంవత్సర నూతన పంచాంగాన్ని వైఖానస సంఘ ప్రతినిధులు మంగళవారం ఆవిష్కరించారు. స్థానిక ప్రధాన రహదారిలోని శ్రీ భూసమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలో వైఖానస సంఘ సమావేశం ఆ సంఘ అధ్యక్షుడు ఖండవిల్లి కేశవాచార్యులు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి తాళ్లరేవు, కాజులూరు, యానాం ప్రాంతాలకు చెందిన వైఖానసులు హాజరై సంఘ అభివృద్ధికి చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు. అనంతరం శోభకృతు నామ సంవత్సర నూతన గంటల పంచాంగాన్ని యానాం మున్సిపల్ కమిషనర్ ఖండవిల్లి రామకృష్ణ, సంఘ ప్రతినిధులు ఆవిష్కరించారు. పెద్దింటి శేషాచార్యులు, పెద్దింటి శ్రావణకుమార్, రాకుదిటి ప్రసాదాచార్యులు, ఖండవిల్లి శ్రీనివాసాచార్యులు, రాకుదిటి శ్రీనివాసాచార్యులు, రాకుదిటి సీతారామాచార్యులు, గోవర్ధనం ప్రభు, పెద్దింటి రవికుమార్, పి.రఘురామ వినోద్ తదితరులు పాల్గొన్నారు.


సీఎంకు కృతజ్ఞతలు

ఆయుష్మాన్ భారత్ బకాయిలు త్వరలో చెల్లింపు

యానాం: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పూర్తిస్థాయి మౌలిక సౌకర్యాల కల్పనకు నిధులు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నందుకు పుదుచ్చేరి సీఎం రంగసామికి ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో జీజీహెచ్‌లో అధునాతన లేబొరేటరీతోపాటు వివిధ విభాగాలను ఏర్పాటు చేస్తున్నారని ప్రకటించారని దీనికి యానాం ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు పేర్కొన్నారు. జీజీహెచ్‌కు ఇప్పుడు ఇస్తున్నవే కాకుండా మరిన్ని మొత్తంలో నిధులు కేటాయించాలని కోరారు. జీజీహెచ్‌లో స్పెషలిస్ట్ వైద్యుల పోస్టులను అవుట్‌సోర్సింగ్‌పై భర్తీ చేయనున్నట్టు, అదేవిధంగా సాంకేతిక సిబ్బందిని ఈ ఏడాదికి రిక్రూట్‌మెంట్ ద్వారా పర్మినెంట్‌గా తీసుకోనున్నామని ఎమ్మెల్యే అడిగిన ప్రశ్నకు సీఎం సమాధానమిచ్చారు. అలాగే ఆయుష్మాన్‌భారత్ ఆరోగ్య పథకం పెండింగ్ బిల్లులు మంజూరు చేస్తారని ఎమ్మెల్యే అశోక్ ప్రశ్నించగా వాటిని త్వరతగతిన చెల్లించనున్నట్లు సమాధానమిచ్చారు.

ఓడలరేవు ఆర్‌అండ్‌బీ రోడ్డు కబ్జా

అల్లవరం: బెండమూర్లంక సెంటర్ నుంచి ఓడలరేవు వేళ్లే ప్రధాన రహదారిని టీడీపీకి చెందిన ఓ నాయకుడు కబ్జా చేసి మంగళవారం మూడు సిమెంట్ స్తంభాలను కూలీల చేత వేయించాడు. రోడ్డుకి ఇరువైపులా ఉన్న గ్రామ కంఠం భూమి ఆ టీడీపీ నాయకుడుది కావడంతో ఎవరూ ప్రశ్నించరని ఇరువైపులా కబ్జాకు పాల్పడ్డాడు. గతంలో ప్రధాన రహదారికి ఓ వైపునా ప్రహరీ నిర్మాణం చేశారు. అప్పుడు ఎవరూ ప్రశ్నించడకపోవడంతో ఇప్పుడు ప్రధాన రహదారికి రెండో వైపునా సిమెంట్ స్తంభాలను వేయించి భారీ వాహనాలు రాకపోకలకు అంతరాయం కలిగేలా చేస్తున్నారు. నాటిన స్తంభాలకు ప్లాస్టిక్ మెస్ ఏర్పాటు చేశారు. రోడ్డు మలుపు, ఆపై మెస్ ఏర్పాటు చేయడంపై వాహనాల రాకపోకలను గుర్తించడం కష్టం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. రోడ్డుపై స్తంభాలు ఏర్పాటుతో ఏ సమయంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై రెవెన్యూ, పోలీసు అధికారులు స్పందించి ఆ స్తంభాలను తొలగించాలని కోరుతున్నారు.


ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన సిమెంట్ స్తంభాలు, మెస్

ఉద్యోగులకు బకాయి జీతాలు చెల్లించాలి

యానాం: స్థానిక కో-ఆపరేటివ్ స్టోర్స్ ఉద్యోగులకు 30 నెలల నుంచి రావాల్సిన బకాయి జీతాలను చెల్లించాలని కోరుతూ కో-ఆపరేటివ్ స్టోర్స్ సిబ్బంది మంగళవారం ఆర్ఏటీ మునిస్వామిని కలిసి వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ బకాయి జీతాలతోపాటు 6 నెలల నుంచి జీపీఎఫ్, పబ్లిక్ సర్వెంట్ సొమ్ము కట్టడం లేదన్నారు. రూ.3కోట్ల వరకూ కో ఆపరేటివ్ సొసైటీ స్టోర్స్ నుంచి మద్యం అమ్మకాలు జరిగాయని, అయినా దానికి సంబంధించి లాభాలు చెప్పడంలేదని తెలిపారు. రెండు రోజుల్లోగా ప్రభుత్వం స్పందించకపోతే నిరాహార దీక్షలకు దిగుతామని హెచ్చరించారు. జీతాలు లేకపోవడంతో సేల్స్‌మెన్ కోరుకొండ బాలకృష్ణ మృతి చెందాడన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పువ్వల శ్రీను, కొక్కిరిగడ్డ రమణ, రెడ్డి సుబ్రహ్మణ్యం, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జూనియర్ ఇంటర్ పరీక్షలు

యానాం: నియోజకవర్గ పరిధిలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. రీజెన్సీ జూనియర్ కళాశాల, ఎస్‌టీపీపీ ప్రభుత్వ జూనియర్ కళాశాల, సాయి జూనియర్ కళాశాలలో పరీక్షలకు ఏర్పాట్లు చేశారు. రీజెన్సీ కళాశాలలో 300 మంది విద్యార్థులు, ఎస్‌టీపీపీ ప్రభుత్వ కళాశాలలో 289 మంది, సాయి జూనియర్ కాలేజీలో 240 మంది పరీక్ష రాయనున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ జరిగే అన్ని సెంటర్లలోను చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లను నియమించారు. ఇప్పటికే ప్రశ్నాపత్రాలను పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచారు. ఆయా సెంటర్ల వద్ద పోలీస్ బందోబస్తు, తాగునీటి, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేశారు. సుమారు 55 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ద్వితీయ సంవత్సర పరీక్షలు ఈనెల 16 నుంచి ప్రారంభం కానున్నాయి.

ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం

విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి

రీజెన్సీ జూనియర్ కళాశాల పట్టణానికి శివారున మెట్టకూరులో ఉందని అక్కడికి రవాణాసదుపాయాలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పలువురు తల్లిదండ్రులు పేర్కొన్నారు. తాళ్లరేవు పరిసర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఈ సెంటర్‌లో పరీక్షలు రాస్తున్నారని ప్రభుత్వ స్పందించి ఆర్టీసీ బస్సును ఈ సెంటర్‌కు వేయాలని కోరారు.

శివారు భూములకు సాగు నీరందిస్తాం


సాగునీటిని పరిశీలిస్తున్న ఎస్ఈ శ్రీనివాసరావు తదితరులు

ముమ్మిడివరం: కాలువ శివారు భూములన్నింటికీ సాగునీరందించేందుకు ఆయిల్ ఇంజిన్లు, మోటార్లు వినియోగించాలని ఇరిగేషన్ ఎస్ఈ జి.శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. ముమ్మిడివరం మండలం మాగాం-అయినాపురం పంట కాలువకు సంబంధించి అయినాపురం-సోమిదేవరపాలెం గ్రామాల శివారు భూములకు సాగునీటి ఎద్దడి రావడంతో బొండాయి కోడు మురుగునీటి కాలువ నుంచి 4 ఆయిల్ ఇంజిన్లు, మూడు మోటార్లతో నీటిని పంటకాలువలకు ఎత్తిపోస్తున్నారు. ఈ ప్రక్రియ సక్రమంగా కొనసాగుతుందా లేదా అనే విషయంపై మంగళవారం ఎస్ఈ తనిఖీ చేశారు. శివారు భూములకు నీరందేవరకు నీటిని ఎత్తి పోయాలని అధికారులను ఆదేశించారు. సాగునీటి కోసం రైతులు ఎటువంటి ఆందోళన చెందనవసరం లేదని ప్రతి ఎకరాకు పూర్తి స్థాయిలో నీటిని అందించేందుకు ఎగువ సీలేరు నుంచి 3వేల క్యూసెక్కుల నీటిని తీసుకుంటున్నామని తెలిపారు. దీంతో 3 డెల్టాలకు 7,300 క్యూసెక్కుల నీటిని అందించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఆయన వెంట డీఈ బి.శ్రీనివాసరావు, రైతులు ఉన్నారు.

అన్నిటా రాణిస్తున్న ఆడపిల్లలు


దరియాలతిప్ప స్కూల్ బాలికలకు బహుమతులు అందజేసిన అధికారులు

యానాం: ప్రస్తుత సమాజంలో ఆడపిల్లలు అన్ని రంగాల్లోను రాణిస్తున్నారని, విద్య, వైద్యం, క్రీడా, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో తమ ప్రతిభను చాటుతున్నారని ఆయుష్ ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ డి.చంద్రాలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక దరియాలతిప్ప డాక్టర్ కేఆర్ నారాయణన్ ప్రభుత్వ హైస్కూల్‌లో బేటీ బచావో బేటీ పఢావో కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. సైకాలజిస్ట్ సూరంపూడి శివ, హెచ్ఎం పద్మశ్రీ, టీచర్లు మహేశ్, రామకృష్ణ, సన్యాసిరావు రాజారావు, హరి ప్రసాద్, మల్లికా, సుందరి, మంజరి, రుక్మిణీ పాల్గొన్నారు. పట్టణ పరిధిలోని ఇందిరాగాంధీ ప్రభుత్వ బాలికల స్కూల్‌లో సైతం బేటీబచావో బేటీ పఢావో కార్యక్రమం జరిగింది. ఎస్ఎస్ఏ ఏడీపీసీ కమిడి ప్రభాకరరావు, హెచ్ఎం వీవీఎస్‌పీఎస్ఎన్ ఆచార్యులు ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.